అర్హులందరికీ ఇళ్ల పట్టాల మంజూరు

• ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హత ఉన్న ప్రతి అక్కాచెల్లెమ్మలకు జగనన్న లేఔట్లలో ఇళ్ల పట్టాలు అందజేశామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 342 జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన చంద్రాయునిపల్లి గ్రామస్తులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. అలాగే పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు బీడుపల్లి గ్రామంలో ఇళ్లు లేని 26 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మాట ఇచ్చిన ప్రకారం నవరత్నాల్లో భాగంగా ఇళ్లు లేని ప్రతి అక్కా చెల్లెమ్మకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి పట్టాలు అందజేశారన్నారు. నియోజకవర్గంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో అక్కడక్కడ ఇళ్లు కోల్పోవడం జరిగిందన్నారు. వారికి అదే గ్రామంలో ఇంటి పట్టాలు అందజేసి ఇళ్లు కూడా నిర్మిస్తామన్నారు. ఎక్కరూ అధైర్య పడకూడదని.. అందరికీ న్యాయం చేస్తామన్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం వద్దు

పుట్టపర్తి టౌన్: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు, మెటీరియల్ అందజేయాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్ నిర్మాణాలపై మండలాల వారీగా రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద నియోజవర్గంలో ఆరు మండలాల్లో 30 వేల ఇళ్లు మంజూరు చేసి


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

లేఔట్లు ఏర్పాటు చేశామన్నారు. అందులో కొంత మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లు పూర్తి చేశారని, మరికొంత మంది గోడల నిర్మాణం, పునాది నిర్మించుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోకి వెళ్లి క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంగంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీ వెంకటనారాయణ, డీఈ షామీర్ బాషా, ఆరు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

నల్లమాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. వంకరకుంట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మాధవ్, అతని భార్య లత, కుమార్తె సైనీ కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మాధవ్‌కు కాలు విరగడంతో ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సానేవారిపల్లికి చెందిన రృష్ణారెడ్డి సతీమణి మధుమతి (40) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వంకరకుంట సర్పంచ్ కుళ్లాయప్ప, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓబిరెడ్డి, నాయకులు విజయశేఖర్ రెడ్డి, హైదరాబాద్ ఓబిరెడ్డి, చిన్నాగప్ప, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నల్లమాడ: మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన టీడీ చెన్నారెడ్డి (70) గుండెపోటుతో బుధవారం బెంగుళూరులో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అదేరోజు రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి చెన్నారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి భార్య పద్మావతమ్మ, ఇద్దరు కుమార్తెలను పరామర్శించారు. కార్యక్రమంలో మృతుని అల్లుడు సైకం శ్రీనివాసరెడ్డి, నాయకులు టీడీ జయరామిరెడ్డి, టీడీ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

కదిరి రూరల్ మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌లో పడి బాసంవారిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు మహేంద్రరెడ్డి మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డి, పెద్ద తిరుపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.


వేళ్లమద్దిలో చెన్నారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

• ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' కండి
• కదరి సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ పిలుపు

ఎన్పీకుంట: ఎన్నికల యుద్ధానికి అందరం సిద్ధం కావాలని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శివాలయం వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్‌లో మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి అధ్యక్షతన కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి తొలి నుంచి పార్టీ కార్యకర్తలే బలం అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోతి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, వాటర్‌షెడ్ చైర్మెన్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

గాండ్లపెంట: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త బి.శాంతమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కదిరిలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, సర్పంచ్ శాంతమ్మ, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, ప్రతాపరెడ్డి, శంకర్‌నాయుడు, రామాంజులరెడ్డి, ఉత్తన్న, కృష్ణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, చలపతి, మైనార్టీ నాయకులు ఇక్బాల్, సికిందర్, బహావుద్దీన్, అమానుల్లా పాల్గొన్నారు.


గాండ్లపెంట: మాట్లాడుతున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, చిత్రంలో హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్‌ను సమన్వయకర్తలు బోయ శాంతమ్మ, మక్బూల్ అహ్మద్ కలిశారు. బత్తల హరిప్రసాద్ తండ్రి మాజీ సర్పంచ్ డా.బత్తల వెంకటరమణను పరామర్శించారు. అనంతరం మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి, నాయకులు పరికి సాధిక్, లీగల్ సెల్ జోనల్ అధ్యక్షుడు లింగాల లోకేశ్వరెడ్డి, బత్తల ఆదినారాయణ, కాంట్రాక్టర్ బాబా, సంపంగి గోవర్దన్, జంపాల నాగేంద్ర, అన్సర్, ఏసు పాల్గొన్నారు.


డా.బత్తల హరిప్రసాద్‌ను కలిసిన సమన్వయకర్తలు శాంతమ్మ, మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ గురువారం కదిరి పట్టణంలోని నానాదర్గాను సందర్శించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఫర్హానా ఫయాజ్, నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు

• విలేకరుల సమావేశంలో పత్ర కులస్తుల వెల్లడి


మాట్లాడుతున్న పత్ర కులస్తులు

ముదిగుబ్బ: పత్ర కులస్తులంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని మండలానికి చెందిన పత్ర కులస్తులు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పాపయ్య, ఉప సర్పంచ్ శేఖర్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. పత్ర కులస్తులంతా టీడీపీ వైపు ఉన్నారంటూ టీడీపీలో ఉన్న కొందరు నాయకులు పచ్చ పత్రికల్లో కథనాలు రాయించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తామంతా వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటామని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పత్ర కులస్తులను బీసీ జాబితాలోకి చేర్చారన్నారు. దీంతో విద్యా, ఉద్యోగాల్లో మాకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ఓసీగా ఉన్న మమల్ని బీసీ జాబితాలోకి చేర్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుడ్‌మార్నింగ్ కార్యక్రమంతో ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గంగినాయుడు, రాములు, రామాంజనేయులు, ఓబుళేసు, మహేష్, నరహరి, సురేంద్ర, ఆంజనేయులు, ఉదయ్, పూజారి చంద్ర, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కదిరి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్ కుమార్



కదిరి టౌన్: కదిరి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీహరిబాబును అనంతపురానికి బదిలీ చేశారు. ఎం.కిరణ్‌కుమార్ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటన

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఏబిపల్లి తండాలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పర్యటిస్తారని ఆ పార్టీ నాయకుడు ఇందుకూరి నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

తనకల్లు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలని కదిరి డీఎస్పీ శ్రీలత అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కొక్కంటిక్రాస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. చంద్రబాబు కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. డీఎస్పీ వెంట ఎస్ఐ రాజశేఖర్, పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్య తీర్చాలని ఆందోళన

కనగానపల్లి: వ్యవసాయ విద్యుత్ సరఫరాలో సంభవిస్తున్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ ముందు రైతులు ఆందోళన నిర్వహించారు. గురువారం మండలంలోని చంద్రాశ్చర్ల, దాదులూరు గ్రామాల రైతులు మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ నాగేంద్ర అక్కడికి చేరుకొని విద్యుత్ సమస్యలపై రైతులతో మాట్లాడారు.

రెడ్డి కులస్తుల అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యే కేతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్‌రెడ్డి

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గురువారం ఆయన నివాసంలో రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్లలో వెనుకబడిన వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమంతో రోజూ మారుమూల గ్రామాల్లో పర్యటించడం సంతోషంగా ఉందన్నారు. అక్కడ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారని కొనియాడారు. తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభోత్సవం

తనకల్లు: బాలసముద్రంలో నిర్మించిన సచివాలయం, గోళ్లవారిపల్లిలో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి గురువారం తెలిపారు. తనకల్లు-ఉస్తినిపల్లి తారురోడ్డును కూడా ప్రారంభిస్తారన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు


యతీంద్ర


కృష్ణంరాజు నాయక్

ముదిగుబ్బ: ముదిగుబ్బ అర్బన్ సీఐగా యతీంద్ర, ముదిగుబ్బ రూరల్ సీఐగా కృష్ణంరాజు నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వీరిద్దరూ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ముదిగుబ్బలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, ఆహ్వానించారు.

రేపు ఉచిత ఆర్థో వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: స్థానిక బ్రాహ్మణవీధి కోటా స్కూల్ పక్కన ఉన్న షిఫా ఆసుపత్రిలో ఈనెల 3వ తేదీన ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యుడు తాహీర్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎముకలు వంకరపోవడం, కండరాలు పట్టుకోవడం, కీళ్లవాతం, రుమటాలజి సమస్యలు, కీళ్లు అరిగిపోవడం, కండరాలు నరాల బలహీనత, తిమ్మరిలు, కాళ్లు మంటలు తదితర వాటికి డాక్టర్ పెంచల ప్రదీప్ బట్ట వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచిత ఆర్థో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుష్టు వ్యాధిపై అపోహలొద్దు

ధర్మవరం రూరల్: కుష్టు వ్యాధిపై అపోహలు వద్దని దర్శనమల పీహెచ్‌సీ వైద్యురాలు పుష్పలత అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో కుష్టువ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి లక్షణాలు, ఎలా వస్తుంది, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, సీహెచ్ఓ కళావతి, హెల్త్ సూపర్ వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ అఫ్రోజ్, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వార్షిక డైరీలు, క్యాలెండర్లను కలెక్టర్ అరుణ్‌బాబు ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం డీఏఓ సుబ్బారావు ఆధ్వర్యంలో ఉద్యోగులకు డైరీ, క్యాలెండర్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీలో ఏడాది పొడవునా సాగు చేసే పంటల వివరాలు, కావాల్సి మందులు, ఎరువులు, యాంత్రీకరణ దిశగా రైతులను తీసుకెళ్లే విధంగా సమాచారాన్ని ముద్రించడం బాగుందన్నారు. వీటిని ప్రతి వ్యవసాయ కార్యాలయం, ఆర్‌బీకేలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ వెంకట బ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు కృష్ణమీనన్, జాయింట్ సెక్రెటరీ శేఖర్ నాయక్, ట్రెజరర్ ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రామగిరి: మండలంలోని తిమ్మాపురం, పేరూరు, నసనకోట, రామగిరి గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా సభ ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ క్రా హనుమంత రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రామగిరి, పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం పంచాయతీల్లోని డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు పాల్గొంటారన్నారు. మండలంలోని అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లక్కీ డిప్ ద్వారా ప్రయాణికులకు బహుమతులు


లక్కీ డిప్ డ్రా తీయిస్తున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందిస్తున్నామని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ధర్మవరం పులివెందుల రూట్ బస్సు లక్కీ డిప్ లాటరీని ప్రయాణికులు, విద్యార్థులతో తీయించారు. మొదటి బహుమతి పులివెందుల జి.కృష్ణమూర్తి, ద్వితీయ బహుమతి మీర్జాంపల్లి నాగయ్య, తృతీయ బహుమతి పులివెందుల రామచంద్ర దక్కించుకున్నారు. ప్రయాణికులకు సమాచారం అందించి సోనాలిక ట్రాక్టర్స్ ఎస్ఎస్ గ్రూప్స్ వారి సహకారంతో బహుమతులు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం


భోజనం వడ్డిస్తున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు దంపతులు

బత్తలపల్లి: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాల్లో కెల్లా అన్నదానం చాలా గొప్పదని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్, ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర స్వామి ఆలయంలో శివమాలధారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని కమిటి సభ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో గురుస్వామి రామాంజనేయులు, గోపాల్, శంకరయ్య, యోగానందా ఆచారీ, బోరు శివయ్య, కమతం లక్ష్మీనారాయణ, సూరి, కప్పల రవి, సురేష్, చిత్రా భాస్కర్, నారాయణస్వామి, మదనాపు రమేష్, కృపాకర్, కోటి అంజి పాల్గొన్నారు.

ఘనంగా మడివాల మాచిదేవ జయంతి


అన్నదానం చేస్తున్న రజక సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం రజక సాధికార కమిటీ సభ్యులు, గంగమ్మ దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రజకుల కులదైవం మడివాల మాచిదేవ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాల్యవంతం నారాయణ స్వామి, సూర్యస్కూల్ నరేంద్ర, మస్తాన్, కొత్తకోట రామంజినేయులు, సాకే అక్కులప్ప, సాకే వెంకటేష్ తదితరులు మడివాల మాచిదేవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. రజకుల అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు సూచించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు బుల్లెట్ బాబా అతని అనుచరులు

ఎన్పీకుంట: మండల పరిధిలోని జౌకల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాబా అలియాస్ బుల్లెట్ బాబా, అతని అనుచరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి సమక్షంలో బుల్లెట్ బాబా, అతని అనుచరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బుల్లెట్‌బాబా, షేక్ సులేమాన్, షఫీ, రమణకు సమన్వయకర్తలు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు.

తహసీల్దార్లకు సన్మానం


తహసీల్దార్లను సత్కరిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆర్డీఓ కార్యాలయం ఏఓ జిలానీ, గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులు, కొత్తచెరువు తహసీల్దార్ రామాంజులరెడ్డి, బుక్కపట్నం తహసీల్దార్ కరుణాకర్, ఓడీసీ తహసీల్దార్ రామనాథరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బదిలీపై ఎక్కడికి వెళ్లినా విధుల్లో అలసత్వం వహించకుండా మంచి గుర్తింపు తీసుకు రావాలన్నారు. ఎన్నికల అనంతరం మళ్లీ శ్రీ సత్యసాయి జిల్లాలో కలుద్దామన్నారు. ఎన్నికల విధులను గుర్తించుకుని జాగ్రత్తగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు

కనగానపల్లి: మండలంలో శుక్రవారం నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు ప్రారంభమవుతున్నట్లు ఏపీఎం హేమలత తెలిపారు. మండలంలోని కేఎన్ పాళ్యం, శివపురం గ్రామాల డ్వాక్రా మహిళలకు ఉదయం 11 గంటలకు పేరూరులోనూ, ముత్తువకుంట్ల, తల్లిమడుగుల డ్వాక్రా సభ్యులకు మధ్యాహ్నం 3 గంటలకు ముత్తువకుంట్లలో గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. సభలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి/తాడిమర్రి/నల్లమాడ: బత్తలపల్లి, తాడిమర్రి, నల్లమాడ మండలాల్లో గురువారం తొలి రోజు పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. బత్తలపల్లి మండల వ్యాప్తంగా 80 శాతం మందికి సొమ్ము అందజేశారు. ఇక నల్లమాడ మండలంలో తొలి రోజే 60 శాతానికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

కొల్లాపురమ్మకు పూజలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు కొల్లాపురమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

ఈవీఎంపై అవగాహన


ఈవీఎం పనితీరును వివరిస్తున్న తహసీల్దార్ రవి కుమార్

నల్లచెరువు: మండల కేంద్రంలోని బురుజు సర్కిల్లో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు ఈవీఎంపై అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలి? ఈవీఎం పనితీరును ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.